క్లుప్తంగా

నేడు కౌన్సిల్ సమావేశం

రామచంద్రపురం: పురపాలక సంఘం కార్యాలయంలో కౌన్సిల్ హాల్‌లో నేడు సాధారణ మున్సిపల్ కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 11 గంటలకు నిర్వహించే ఈ సమావేశానికి కౌన్సిల్ సభ్యులు, కో ఆప్షన్ సభ్యులు, అధికారులు హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.

రేపు మండపేట మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం ఈ నెల 30న నిర్వహించనున్నట్టు చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి సోమవారం తెలిపారు. మండపేట మున్సిపల్ సమావేశ మందిరంలో ఉదయం 11 గంటలకు జరిగే సమావేశంలో 14 అంశాలతో కూడిన అజెండాలోని అంశాలపై చర్చిస్తామన్నారు. అధికారులు, కౌన్సిలర్లు సకాలంలో హాజరుకావాలని చైర్‌పర్సన్ దుర్గారాణి కోరారు.

అన్నదానానికి రూ.11,111 విరాళం



అంగరలో స్వామిని దర్శించుకుంటున్న దాతలు

కపిలేశ్వరపురం: అంగరలో వేంచేసిన వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్వహించే అన్నదానానికి అదే గ్రామానికి చెందిన యర్రంశెట్టి చంద్రరావు, గంగాలక్ష్మి దంపతుల కుమార్తె శ్రీలక్ష్మి, కుమారుడు సత్యసాయిరామ మణికంఠ రూ.11,111 విరాళం సమర్పించారు. వారు సోమవారం స్వామివారిని దర్శించుకుని ఆలయ నిర్వాహకులకు విరాళం సొమ్మును అందజేశారు. దాతలను ఆలయ కమిటీ సభ్యులు అభినందించారు.

వరద పట్ల అప్రమత్తం



కపిలేశ్వరపురం పుష్కర ఘాట్ వద్ద వరదను పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రీనివాస్

కపిలేశ్వరపురం: గౌతమి గోదావరి నదిలో పెరుగుతున్న వరద పట్ల ఉన్నతాధికారుల సూచనల మేరకు అప్రమత్తంగా ఉన్నట్టు తహసీల్దార్ జి.శ్రీనివాస్ తెలిపారు. కపిలేశ్వరపురం పుష్కర ఘాట్ వద్ద వరద ఉధృతిని సోమవారం రెవెన్యూ ఉద్యోగులతో కలిసి పరిశీలించారు. వరద నీరు పుష్కర ఘాట్‌ను తాకింది. మరింత ఉధృతి పెరిగితే లంక గ్రామాల్లో ముందస్తు జాగ్రత్తలకు ఉపక్రమిస్తామని తెలిపారు. ఆయన వెంట డిప్యూటీ తహసీల్దార్ జానకిరామయ్య, వీఆర్వోలు వెన్నేటి రామకృష్ణ, వి.రాముడు ఉన్నారు.

పంట తెగుళ్లపై శ్రద్ధ వహించాలి

కాజులూరు: పంట తెగుళ్లపై రైతులు తొలిదశ నుంచి తగిన శ్రద్ధ వహించాలని మండల వ్యవసాయాధికారి వి.అశోక్ అన్నారు. సోమవారం మండలంలోని బందనపూడి, గొల్లపాలెంలో వ్యవసాయాధికారి పర్యటించారు. బందనపూడిలో ఏఓ మాట్లాడుతూ వరిసాగులో పంట తొలి దశ నుంచే మేలైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే ఆశించిన లాభాలు పొందవచ్చన్నారు. ప్రస్తుతం మండల గ్రామాల్లో రైతులు నారుతీసి నాట్లు వేసే విధానానికి బదులు ఎక్కువగా వెదజల్లు విధానం అవలంబిస్తున్నారని ఈ విధానం మేలైనదే అయినప్పటికి కలుపు తీవ్రత ఎక్కువగా ఉంటుందన్నారు. రైతులు ముందు నుంచి తగిన మందులు వినియోగించి కలుపును సమర్థవంతగా అరికడితే వెదజల్లులో మేలైన దిగుబడులు సాధించవచ్చన్నారు.

బీజేపీ నాయకుల సమావేశం

రాయవరం: మండలంలోని లొల్ల గ్రామంలో సోమవారం బీజేపీ మండల సమావేశం నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు శాకా దుర్గా శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో బీజేపీ మండపేట నియోజకవర్గ కన్వీనర్ కేవీవీ సాయి రామ్ మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశాభివృద్ధికి చేస్తున్న కృషిని వివరించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడిగా ఎంపికైన చాట్రాతి జానకిరాం బాబు, కొత్తపల్లి శ్రీదేవి, కార్యవర్గ సభ్యులుగా ఎంపికైన రాయి వీర్రాజు, తోరం రాము, టి.సూర్యనారాయణరాజులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

సర్పంచ్ శ్రీధర్‌కు ఘన నివాళి

రామచంద్రపురం రూరల్: మండలంలోని ఏరుపల్లి గ్రామ సర్పంచ్, వైఎస్సార్ సీపీ పంచాయతీ రాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు మల్లిమొగ్గల శ్రీధర్ ఆదివారం అనారోగ్యంతో మృతి చెందిన సంఘటన పాఠకులకు విదితమే. ఆయన భౌతిక కాయాన్ని రామచంద్రపురంలోని ఆయన క్లినిక్ వద్ద బంధువులు, పార్టీ శ్రేణుల సందర్శనార్థం ఉంచగా నియోజకవర్గ కోఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్, జెడ్పీటీసీ ఎం.వెంకటేశ్వరరావు, ఎంపీపీ అంబటి భవాని, వైస్ ఎంపీపీ నరాల రాజ్యలక్ష్మి, శెట్టిబలిజ సంఘ పెద్దలు కట్టా సూర్యనారాయణ, నరాల ఏడుకొండలు, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి ఆయన భౌతిక కాయాన్ని సందర్శించి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఏరుపల్లిలో భౌతికకాయానికి అంతిమ సంస్కారాలు నిర్వహించారు.

చైతన్యమే శ్రీరామరక్ష !

- అవగాహనతోనే భ్రూణహత్యల నివారణ
- పీసీపీఎన్‌డీటీ చట్టం అమలుకు కేంద్రం పటిష్ట చర్యలు
- లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే ఆసుపత్రులు, స్కానింగ్ సెంటర్ల లైసెన్స్ రద్దు
- క్షేత్ర స్థాయిలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు



అంగర పీహెచ్‌సీలో గర్భిణిని పరీక్షిస్తున్న డాక్టర్ (ఫైల్)

కపిలేశ్వరపురం: అమ్మ కడుపులో పిండం ఎన్నో జన్మల బంధం. పుట్టబోయే బిడ్డ ఆడ అయినా, మగ అయినా ముద్దులొలికే చిరునవ్వే. సమాజంలో ఇద్దరికీ బేధం లింగపరమైనదే తప్ప ఆధునిక జీవన విధానంలో వ్యత్యాసం లేదు. వైద్య రంగంలో పెరిగిన సాంకేతిక పరిజ్ఞానంతో కడుపులో బిడ్డ ఆరోగ్య స్థితిగతులను తెలుసుకుంటున్నాం. బిడ్డ ఎదుగుదలలో సమస్యలు తలెత్తితే సరిచేసే చికిత్సా పద్ధతులుండనే ఉన్నాయి. కడుపులోని బిడ్డ లింగ నిర్ధారణ కోసం సాంకేతికతను ఉపయోగిస్తే చట్టరీత్యా నేరం. గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధ (పీసీపీఎన్‌డీటీ) చట్టం పటిష్ట అమలుకు కేంద్రం తగిన చర్యలు చేపడుతోంది.

అధికారులు హెచ్చరికలు ఇలా..

కేంద్ర ప్రభుత్వం లింగ నిర్ధారణ పరీక్షల కట్టడిపై అధికారులను అప్రమత్తం చేస్తోంది. ఈ నెల 11న జిల్లా కలెక్టరేట్‌లో కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధ చట్టం-1994 అమలుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రైవేటు ఆసుపత్రులు, స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులు లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడంతో పాటు లైసెన్స్‌లను రద్దు చేస్తామని హెచ్చరించారు. జూన్ 5న కాకినాడ ఆర్డీఓ కార్యాలయంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ కేవీ సుబ్బరాజు చట్టం అమలుపై సమావేశం నిర్వహించి పలు హెచ్చరికలు చేశారు.

పటిష్టమైన చట్టం బిడ్డకు శ్రీరామరక్ష

గర్భస్థ శిశు లింగ నిర్ధారణ నిషేధ చట్టం- 1994 అమలు కడుపులోని బిడ్డకు శ్రీరామరక్ష. బిడ్డను చిదిమేసే ఆలోచన ఎవరికి వచ్చినా శిక్షకు సిద్ధంగా ఉండాలని ఈ చట్టం చెబుతోంది. ప్రభుత్వం వద్ద లైసెన్స్ పొందిన స్కానింగ్ సెంటర్లు నిబంధనలను మీరితే చట్ట ప్రకారం చర్యలు తప్పవు. అల్ట్రా సౌండ్ వైద్య పరీక్షలను లింగ నిర్ధారణకు ఉపయోగించుకోవడం చట్టరీత్యా నేరం. అలా చేస్తే స్కానింగ్ సెంటర్ లైసెన్స్ రద్దు అవ్వడంతో పాటు వైద్యులపై కేసు నమోదు చేస్తారు. నేరం రుజువైతే మూడేళ్ల జైలు శిక్ష, రూ.లక్ష జరిమానా విధించే అవకాశం ఉంది.

రెండు నియోజకవర్గాల్లో స్కానింగ్ సెంటర్లు ఇలా..

గర్భంలోని పిండం ఆరోగ్య పరిస్థితిని తెలుసుకునేందుకు ప్రభుత్వం ఏరియా ఆసుపత్రి, సీహెచ్‌సీలలో స్కానింగ్ పరికలాను సమకూర్చింది. రామచంద్రపురం ఏరియా ఆసుపత్రి, కపిలేశ్వరపురం, మండపేట, ఆలమూరు, కొత్తపేట సీహెచ్‌సీల్లో స్కానింగ్ పరికరాలున్నాయి. అవి కాకుండా రామచంద్రపురం, మండపేట పట్టణాల్లో మూడు చొప్పున ప్రైవేటు స్కానింగ్ సెంటర్లు ఉన్నాయి.

జోరుగా అవగాహన కార్యక్రమాలు

గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షలు చేయడంలో గల నష్టాలను వివరించడంతో పాటు గర్భస్థ శిశు లింగ నిర్ధారణ నిషేధ చట్టం- 1994 చట్టంపై ప్రభుత్వ ఆసుపత్రుల సిబ్బందికి అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. స్కానింగ్ సెంటర్లలో లింగ నిర్ధారణ చేస్తున్నట్టు తెలిస్తే 18004 253365 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసే ఏర్పాట్లు చేశారు. గ్రామాల్లో సమావేశాలు నిర్వహించి పీసీపీఎన్‌డీటీ చట్టంపై ప్రజలకు అవగాహన కలిస్తున్నారు.

డెకాయ్ ఆపరేషన్లు

భ్రూణ హత్యలు, లింగ నిర్ధారణ పరీక్షలను అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం 1994లో ప్రీ కన్సప్షన్ అండ్ ప్రీ నాటల్ డయాగ్నోస్టిక్ టెక్నిక్స్ (పీసీపీఎన్‌డీటీ) చట్టాన్ని అమలులోకి తీసుకొచ్చింది. ఈ చట్టం ప్రకారం లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం, భ్రూణ హత్యలు చేయడం నేరం. చట్టం అమలులో భాగంగా డెకాయి ఆపరేషన్ పేరుతో మూడు నెలలకు ఒకసారి స్కానింగ్ సెంటర్లను అధికారులు తనిఖీ చేస్తున్నారు.

> **క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తున్నాం**
>
> మాతాశిశు సంరక్షణ కోసం ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సేవలు పొందడం మేలు. అన్ని విధాలా ప్రభుత్వ పరంగా పరీక్షలు చేసి తల్లీ బిడ్డల ఆరోగ్యాన్ని పరిరక్షిస్తాం. ఉన్నతాధికారుల ఆదేశాలపై క్షేత్ర స్థాయిలో లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం నేరమని క్షేత్రస్థాయిలో ప్రచారం చేస్తున్నాం. ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం.
>
> పి.రత్నకుమారి, వైద్యాధికారి, అంగర పీహెచ్‌సీ, కపిలేశ్వరపురం

కూటమి హామీలను ప్రజలకు గుర్తు చేయాలి



తాపేశ్వరం గ్రామ నాయకులతో మాట్లాడుతున్న ఎంపీపీ శ్రీనివాస్

కపిలేశ్వరపురం (మండపేట): ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను ప్రజలకు గుర్తు చేసి, వాటి అమలుకు ప్రభుత్వాన్ని ప్రశ్నించేలా జనాన్ని జాగృతం చేయాలని మండపేట ఎంపీపీ ఉండమట్ల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఆదేశాలు మేరకు మండపేట రూరల్ గ్రామాల్లో బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమాలను నిర్వహించేందుకు సమాయత్తమైనట్టు తెలిపారు. ఆగస్టు 3న తాపేశ్వరంలో నిర్వహించే బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీపై సోమవారం ఎంపీపీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ తాపేశ్వరం గ్రామ నాయకులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయించే వరకూ ప్రజలతో ముందుకు నడుస్తామన్నారు.

సత్యనారాయణ మృతికి సంతాపం

కపిలేశ్వరపురం: వెదురుమూడి గ్రామ మాజీ సర్పంచ్, వైఎస్సార్ సీపీ నాయకుడు బెల్లం సత్యనారాయణ ఆదివారం ఆకస్మికంగా మృతి చెందారు. ఆయన మృతికి గ్రామానికి చెందిన పెద్దలు ఆచంట సుబ్బారావు, కోలా లక్ష్మణరావు, వనుం పార్థసారథి, గుత్తుల పుష్పాలరావు, ఆకుల రాజు సోమవారం సంతాపం వ్యక్తం చేశారు.

ఎమ్మెల్సీ తోటకు శుభాకాంక్షల వెల్లువ



ఎమ్మెల్సీ తోటకు శుభాకాంక్షలు తెలుపుతున్న పార్టీ నాయకులు పాపారాయుడు, వెంకన్నబాబు తదితరులు

కపిలేశ్వరపురం (మండపేట): ఈ నెల 26న ఏపీ శాసన సభ, శాసన మండలికి ఉమ్మడి కమిటీలను రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. సబార్డినేట్ లెజిస్లేషన్ కమిటీ చైర్మన్‌గా ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు నియమితులయ్యారు. దీంతో ఆది, సోమవారాల్లో నియోజకవర్గంలోని ప్రముఖులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయనకు శుభాకాంక్షలు చెప్పేందుకు మండపేటలోని పార్టీ కార్యాలయానికి తరలివచ్చారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కర్రి పాపారాయుడు, జిల్లా ఉపాధ్యక్షుడు దూలం వెంకన్నబాబు, మండపేట నాయకులు జిన్నూరి సాయిబాబా, పెంకే గంగాధర్, సూరంపూడి సత్యప్రసాద్, అద్దంకి రమణ, రాయపాటి సత్యనారాయణ, యడ్ల రవి, చందమళ్ల లాజర్, సమ్మతం పెద్ద పాపారావు, కొప్పిరెడ్డి ప్రసాద్, అన్నందేవుల కృష్ణ, సలాది శివ, అబ్బిరెడ్డి వీర్రాజు, ముక్కపాటి చిన్నబాబు, తుపాకుల ప్రసన్నకుమార్, కపిలేశ్వరపురం మండల నాయకులు యర్రంశెట్టి నాగేశ్వరరావు, పోలిశెట్టి గణేష్, యర్రంశెట్టి సత్తిబాబు తదితరులు ఆయనకు అభినందనలు తెలిపారు.

ప్రజలను మభ్యపెడుతున్న కూటమి

- అభివృద్ధి పేరుతో అప్పులు
- ప్రజలను తప్పుదారి పట్టించేందుకే కుట్రలు
- కోఆర్డినేటర్ సూర్యప్రకాశ్



కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలను ప్రజలకు వివరిస్తున్న కోఆర్డినేటర్ సూర్యప్రకాశ్ తదితరులు

రామచంద్రపురం: ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా అభివృద్ధి పేరుతో ఏడాదిలోనే రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో నెట్టేస్తూ దానిని కప్పిపుచ్చుకునేందుకు వైఎస్సార్ సీపీ నేతలపై తప్పుడు కేసులు బనాయిస్తూ కూటమి ప్రభుత్వం ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తుందని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షులు, నియోజకవర్గ కో ఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్ విమర్శించారు. మున్సిపాలిటీ పరిధిలో 9 వార్డు జల్లిపేట, శాంతి నగర్ ప్రాంతాల్లో సోమవారం బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహిస్తూ కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలను ప్రజలకు వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో సూపర్‌సిక్స్ పేరుతో ప్రజల వద్దకు వచ్చిన చంద్రబాబునాయుడు నేడు వాటిని విస్మరించి అమలు చేసేందుకు కుంటి సాకులు చెబుతున్నారని విమర్శించారు. ఎన్నికల మేనిఫెస్టోలో ప్రజలకు చెప్పిన విధంగా వాటిని అమలు చేయకుండా ఆర్థిక సంక్షోభంలో రాష్ట్రం ఉందంటూ కూటమి నేతలు పదే పదే చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కరోనా వంటి క్లిష్ట సమయంలో కూడా అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు వచ్చిన మాట ప్రకారం అన్ని పథకాలను అమలు చేసి చూపించారని గుర్తుకు చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసే వరకు ప్రజల పక్షాన వైఎస్సార్ సీపీ పోరాటం చేస్తుందని సూర్యప్రకాశ్ స్పష్టం చేశారు. మున్సిపల్ చైర్ పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు కుడిపూడి శ్రీనివాసరావు, పట్టణ పార్టీ కన్వీనర్ గాదంశెట్టి శ్రీధర్, స్థానిక కౌన్సిలర్ కోటి శ్రీకన్య, పార్టీ నేతలు పెంటపాటి శ్రీను, పోతంశెట్టి గోపాలకృష్ణ, సత్తి సాయిలక్ష్మి, వార్డు నాయకులు జుత్తుగ గులాంబాషా, కోటి దుర్గారావు, పి.గోవిందు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ మండల సారథుల నియామకం



పి.శ్రీనివాస్



ఎ.బాబ్జి



జి.సత్యనారాయణ



వి.వీరవెంకట సత్యనారాయణరెడ్డి

కపిలేశ్వరపురం: మండపేట నియోజకవర్గంలోని వైఎస్సార్ సీపీ మండల కమిటీలకు నూతన సారథులు నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలు మేరకు మండల కమిటీల సారథులను వెల్లడించారు. మండపేట పట్టణ కమిటీ అధ్యక్షుడిగా పిల్లి శ్రీనివాస్, మండపేట రూరల్ మండల కమిటీ అధ్యక్షుడిగా అడబాల బాబ్జి, కపిలేశ్వరపురం మండల కమిటీ అధ్యక్షుడిగా గూటం సత్యనారాయణ, రాయవరం మండల కమిటీ అధ్యక్షుడిగా వెలగల వీరవెంకట సత్యనారాయణరెడ్డిలను నియమించారు. నియోజకవర్గానికి చెందిన యర్రగుంట మణికంఠ కుమార్ (అయ్యప్ప)ను జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శిగా నియమించారు.

'పర్సా' మాస్టారి మృతి



పర్సా రాధాకృష్ణ మూర్తి (ఫైల్)

కపిలేశ్వరపురం: మండలంలోని పడమర ఖండ్రిక గ్రామానికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు పర్సా రాధాకృష్ణమూర్తి (పర్సా మాస్టారు) (82) వృద్ధాప్యంతో మృతి చెందారు. 1963లో ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయ వృత్తిలోకి వచ్చిన మాస్టారు 2001 జూన్‌లో ద్రాక్షారామ పాఠశాలలో ఉద్యోగ విరమణ చేశారు. అనంతరం స్వగ్రామం పడమర ఖండ్రికలో ఉంటూ తనకు ఇష్టమైన బుక్ బైండింగ్ వృత్తిని వ్యాపకంగా కొనసాగించారు. పిల్లలకు సైతం బైండింగ్ నేర్పేవారు. వృద్ధాప్యం వెంటాడటంతో పెద్దాపురంలో ఉంటున్న ఆయన కుమారుడు ఇంటిలో 26వ తేదీ రాత్రి మృతి చెందారు. ఆయన మృతికి పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

తల్లికి వందనం ఓ నయవంచన



జొన్నకూటి పద్మజ

కాజులూరు: తల్లికి వందనం పేరుతో మహిళలను సీఎం చంద్రబాబు మోసం చేశారని, అర్హులైన చాలా మంది ఖాతాలకు నేటికీ సొమ్ములు జమ కాలేదని వైఎస్సార్ సీపీ మండల మహిళా విభాగం నేత, గొల్లపాలెం ఎంపీటీసీ జొన్నకూటి పద్మజ ఆరోపించారు. సోమవారం గొల్లపాలెంలో ఆమె మాట్లాడుతూ ఎన్నికల ముందు సూపర్‌సిక్స్ పేరుతో ప్రజలకు హామీలిచ్చి వాటిని అమలు చేయకుండా ఏడాది పాటు కూటమి ప్రభుత్వం అప్రజాస్వామికంగా, అరాచకపాలన కొనసాగిస్తున్నారని విమర్శించారు. ఎంత మంది పిల్లలుంటే అందరికి తల్లికి వందనం పథకం వర్తిస్తుందని నమ్మబలికారని తీరా ఇప్పుడు కొంత మందికి మాత్రమే సొమ్ములు జమచేస్తున్నారన్నారు. ప్రతి బిడ్డకు రూ.15 వేలు చొప్పున ఇస్తామని ప్రస్తుతం కొంతమంది తల్లులకు రూ.8,500 మాత్రమే జమ చేశారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సరంలో ఏమీ చేయకపోయినా, సూపరిపాలనకు తొలి అడుగు పేరుతో ఊరూరా తిరుగుతూ సొంత డబ్బా కొట్టుకుంటున్నారని విమర్శించారు.

593 మద్యం బాటిళ్ల పట్టివేత

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామ పోలీసులకు వచ్చిన సమాచారం మేరకు ద్రాక్షారామ ఎస్సై ఎం.లక్ష్మణ్ నేతృత్వంలో యానం నుంచి ద్రాక్షారామ వస్తున్న పాసింజర్ ఆటోను వేగాయమ్మపేట గ్రామం వద్ద తనిఖీ చేయగా అందులో అక్రమంగా తరలిస్తున్న 593 మద్యం బాటిళ్లు, ఆటోను స్వాధీనం చేసుకోవడంతో పాటు వాటిని అక్రమంగా తరలిస్తున్న యానంకు చెందిన పత్తి శివ సత్యనారాయణపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై లక్ష్మణ్ సోమవారం విలేకరులకు తెలిపారు.

భీమేశ్వరుని దర్శించుకున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి



వేదాశీర్వచనం అందుకుంటున్న ఎమ్మెల్యే ద్వారకానాథ్ రెడ్డి, పిల్లి సూర్యప్రకాశ్ తదితరులు

రామచంద్రపురం రూరల్: అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లి వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకానాథ్‌రెడ్డి సోమవారం ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామిని దర్శించుకున్నారు. వైఎస్సార్ సీపీ రామచంద్రపురం నియోజకవర్గ కోఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్, పార్టీ నాయకులు ఆయనకు స్వాగతం పలికారు. ఆలయ అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. భీమేశ్వరస్వామిని, మాణిక్యాంబా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం నంది మండపంలో వేద పండితుల వేదాశీర్వచనాలు అందుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ అంబటి భవాని, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అధ్యక్షురాలు, వెంకటాయపాలెం సర్పంచ్ యల్లమిల్లి సతీష్‌కుమారి, ఏపీఐడీసీ మాజీ డైరెక్టర్ వాసంశెట్టి శ్యామ్, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పెమ్మిరెడ్డి మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

12న రామచంద్రపురంలో కోనసీమ యూత్ మీట్



విద్యార్థులతో కలసి పోస్టర్ ఆవిష్కరిస్తున్న మంత్రి సుభాష్

రామచంద్రపురం: యువత దేశానికి వెన్నెముక అని, వారిని సక్రమమైన మార్గంలో నడిపిస్తే దేశ భవిష్యత్తుకు మార్గదర్శకంగా నిలుస్తారని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. ఆగస్టు 12న అంతర్జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా రామచంద్రపురంలో కోనసీమ యూత్ మీట్ పేరుతో నిర్వహించే కార్యక్రమ పోస్టర్‌ను సోమవారం సాయంత్రం మంత్రి సుభాష్ యువత సమక్షంలో ఆవిష్కరించారు. రామచంద్రపురం లయన్స్ క్లబ్ కళ్యాణ మండపంలో జరిగిన ఈ కార్యక్రమంలో యువతను ఉద్దేశించి మంత్రి సుభాష్ మాట్లాడారు. యువతలో దాగివున్న ప్రతిభను బయటకు తీసుకొచ్చి, వారిలో నాయకత్వ లక్షణాలు నింపేందుకు, సమాజం పట్ల సామాజిక బాధ్యత కలిగి వ్యవహరించేందుకుగాను ఆగస్టు 12న రామచంద్రపురంలోని బైపాస్ రోడ్‌లో ఉన్న విజయ్ ఫంక్షన్ హాల్లో ఉదయం 9 గంటలకు పెద్ద ఎత్తున కోనసీమ యూత్ మీట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దేశ భవిష్యత్తులో యువతదే కీలక పాత్ర అని, యువత తమలోని శక్తిని గుర్తించి వారి కలలను సాకారం చేసే దిశగా కోనసీమ యూత్ మీట్ ఉంటుందన్నారు. అన్ని రంగాల్లోనూ యువత కీలకపాత్ర పోషిస్తూ దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని మంత్రి సుభాష్ పిలుపునిచ్చారు. అంతర్జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా పలు పోటీలు కూడా నిర్వహించి బహుమతులు అందజేస్తామన్నారు.

ఎస్సీ వర్గీకరణ ముసుగులో దేశవ్యాప్త కుట్ర



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న రత్నాకర్ తదితరులు

రామచంద్రపురం: ఎస్సీ వర్గీకరణ ముసుగులో దేశవ్యాప్తంగా రాజకీయ కుట్ర జరుగుతోందని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు ఆర్ఎస్ రత్నాకర్ అన్నారు. రామచంద్రపురంలో సోమవారం ఆయన నిర్వహించిన మీడియా సమావేశంలో రత్నాకర్ మాట్లాడారు. దళితులు కలసి ఉంటే రాజ్యాధికారం వైపు కన్నెత్తి చూసే అవకాశం ఉన్నందున శాశ్వతంగా దళితులను రాజకీయంగా దూరం చేయడానికి కేంద్రంలో మోదీ ప్రభుత్వం, తెలుగు రాష్ట్రాల్లో చంద్రబాబు, రేవంత్‌రెడ్డి ప్రభుత్వాలు కుట్ర చేస్తున్నాయన్నారు. దీనికి అన్ని రాజకీయ పార్టీలు మద్దతు పలకడం దారుణమన్నారు. భారతదేశ చరిత్రలోనే ఇది దారుణమైన కుట్ర అని ఎస్సీ వర్గీకరణ పేరుతో వంద మందికి నలుగురు మాత్రమే లబ్ధి పొందుతున్నారని, రిజర్వేషన్ ముసుగులో దేశావ్యాప్తంగా ఉన్న 1108 ఎస్సీ కులాలు వాటాల కోసం నిరంతరం కొట్టుకునే విధంగా కుట్రలు జరుగుతున్నాయన్నారు. తెలుగు రాష్ట్రాల్లో వేరే సమస్యలు లేనట్లు కేవలం ఎస్సీ వర్గీకరణ అంశాన్ని తెరపైకి తెచ్చి మాల సామాజికవర్గాన్ని అన్ని రాజకీయ పార్టీలు తొక్కేస్తున్నాయన్నారు. దీనిపై మాల సోదరులు, మాల ప్రజా ప్రతినిధులు స్పందించకపోవడం దారుణమని, చరిత్రలో మాల జాతి అంతరించిపోయే ప్రమాదం ఉందంటూ ఆందోళన వ్యక్తం చేశారు. నార్త్ ఇండియాలో రైతులు చేసిన ఉద్యమాల అదే తరహాలో ఇక్కడ తెలుగు రాష్ట్రాల మాలలు ఉద్యమించాలని రత్నాకర్ పిలుపునిచ్చారు. దేశం మొత్తం మీద మాదిగలదే పైచేయి అని, తెలుగు రాష్ట్రాల్లో మాత్రమే మాలలు అధికమన్నారు. రిజర్వేషన్ల పేరుతో మాలలను దోషులుగా నిలిపే ప్రయత్నాలను ప్రభుత్వాలు చేస్తున్నాయని, దీన్ని ప్రతిఘటించేందుకు దేశవ్యాప్తంగా శాంతియుత ఉద్యమాలు నిరంతరం చేయాలని రత్నాకల్ పిలుపునిచ్చారు.

విద్యా హక్కు చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలి



ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

రామచంద్రపురం: కార్పొరేట్ ప్రైవేట్ పాఠశాలల్లో ఉచిత సీట్లు పొందిన విద్యార్థులపై ఫీజుల దోపిడీ అరికట్టాలని విద్యా హక్కు చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని కోరుతూ పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో విద్యార్థుల తల్లిదండ్రులతో కలసి ఆర్డీవో కార్యాలయం వద్ద సోమవారం నిరసన చేపట్టారు. అనంతరం ఆర్డీవో కార్యాలయంలో ఈ మేరకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.సిద్ధూ మాట్లాడుతూ రైట్ టు ఎడ్యుకేషన్ చట్టం కింద ప్రభుత్వ ఖర్చుతో ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులపై ప్రభుత్వం ఘోరమైన నిర్లక్ష్యం చూపుతోందని వాపోయారు. కూటమి ప్రభుత్వం తగిన నిధులు విడుదల చేయకపోవడం వల్ల తల్లిదండ్రులు, విద్యార్థులు అవమానాలను ఎదుర్కొంటున్నారన్నారు. రామచంద్రపురం, మండపేట, రాయవరం, కె.గంగవరం, కాజులూరు, కపిలేశ్వరపురం మండలాల్లో లక్షల్లో ఫీజులు బకాయిలుగా ఉన్నాయని, కార్పొరేట్ ప్రైవేటు యాజమాన్యాలు తల్లిదండ్రుల నుంచి ముక్కు పిండి వసూలు చేస్తున్నారని, కార్పొరేట్, ప్రైవేట్ స్కూళ్ల దౌర్జన్యాన్ని అరికట్టాల్సిన ప్రభుత్వం చేతులు పైకి ఎత్తేసిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం ఆర్టీఈ 12(1)(ఇ) ద్వారా కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల్లో ఉచిత సీట్లు పొందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ, మైనారిటీ, వికలాంగ, అనాథ పిల్లలకు తల్లికి వందనం పథకాన్ని నేరుగా స్కూల్ వారి బ్యాంకు ఖాతాకు ఎనిమిది వేల రూపాయలు జమ చేస్తామని కూటమి ప్రభుత్వం జీ.ఓ 9ను 12.06.2025న తెచ్చిందన్నారు. తల్లికి వందనం పథకాన్ని ఉచిత సీట్లు పొందిన విద్యార్థులకు హోల్డ్‌లో పెట్టిందని, కానీ కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలు తల్లిదండ్రులను ముక్కు పిండి వసూలు వసూలు చేస్తున్నారన్నారు. విద్యార్థులపై జోక్యం చేసుకుంటున్న కార్పొరేట్, ప్రైవేట్ స్కూళ్లపై చర్యలు తీసుకోవాలి డిమాండ్ చేశారు. గత రెండు వారాల నుంచి జరుగుతున్న ఆర్టీఈ చర్చపై రామచంద్రపురం డివిజన్ విద్యాశాఖ అధికారి డీవైఈఓ విద్యార్థి సంఘాలను, తల్లిదండ్రులను, స్కూల్స్ ప్రిన్సిపాల్స్‌తో చర్చించారన్నారు. డీవైఈఓ ముందు విద్యార్థి సంఘాలు నాయకులు, తల్లిదండ్రులు తమ గోడును వెల్లబుచ్చుకున్నారని, ఈ సందర్భంగా డివైఈఓ మాట్లాడుతూ కార్పొరేట్, ప్రైవేట్ ఉచిత సీట్ల పొందిన విద్యార్థుల దగ్గర్నుంచి ట్యూషన్ ఫీజులు, అడ్మిషన్ ఫీజులు, యాక్టివిటీస్ ఫీజులు కట్టించుకోకూడదని, కట్టించుకుంటే కార్పొరేట్, ప్రైవేటు విద్యాసంస్థలపై చర్యలు తీసుకుంటామని చెప్పినట్లు సిద్ధూ తెలిపారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా తూర్పుగోదావరి జిల్లా నాయకులు పీవైఎల్‌వీ భీమశంకరం, రాజారెడ్డి, కె.శివ, వి.నాగరాజు, కె.నవీన్, కె.రవి, ఎం.పెద్ద, ఫణీంద్ర, పార్థు, ఎం.సూరిబాబు, ఎం.నానాజీ, ప్రసాద్ పాల్గొన్నారు.